సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 26 । ఆగస్టు । 2023



ఫిట్‌నెస్ పరీక్షలు
ఎస్సై పోస్టుల భర్తీకి సర్కారు చర్యలు చేపట్టింది. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. 8లో ▸



చంద్రబాబు, లోకేష్‌పై ఫిర్యాదు
చంద్రబాబు, లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం అత్తిలి పోలీస్‌స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. 8లో ▸



వెండి వాకిలి తయారీకి శ్రీకారం
తాడేపల్లిగూడెం పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ తల్లికి వెండి వాకిలి తయారీకి శ్రీకారం చుట్టారు. మొత్తం 40 కిలోలతో వెండి వాకిలి సిద్ధం కానుంది. 8లో ▸

న్యూస్‌రీల్

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెన్నేటి జగజ్జీవన్

తాడేపల్లిగూడెం రూరల్: జిల్లా నూతన కార్యవర్గంలో పదవులు పొందిన వారు పార్టీ విజయానికి కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితుడైన తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన తెన్నేటి జగజ్జీవన్ శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. జగజ్జీవన్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

మావుళ్లమ్మను దర్శించుకున్న కారుమూరి దంపతులు



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దంపతులు

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ వారిని శుక్రవారం పౌరసరాఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దంపతులు దర్శించుకున్నారు. ముందుగా మంత్రి దంపతులకు ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం నాగేశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మదిరాల మల్లికార్జున శర్మ వేద ఆశీర్వాచనం అందించగా, సహాయ కమిషనర్ భద్రాజీ అమ్మవారి చిత్రపటం, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మకర్తలు చెల్లింకి గిరి, తాళ్లపూడి భాగ్యలక్ష్మీ, రామయణం సత్యనారాయణ, గోపిశెట్టి విజయలక్ష్మీ, ఆలయ సూపరింటెండెంట్ బాబురావు, అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ పాలకమండలి సభ్యుడిగా గాదిరాజు



గాదిరాజు వెంకట సుబ్బరాజు

నిడమర్రు: టీటీడీ నూతన పాలక మండలి సభ్యుడిగా నిడమర్రు మండలం మందలపర్రు గ్రామానికి చెందిన గాదిరాజు వెంకట సుబ్బరాజు (పెదబాబు)కు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆయన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి పనిచేశారు. ప్రస్తుతం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా, అమలాపురం జిల్లా రాజోలు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ పరిశీలకుడిగా ఉన్నారు. గతంలో మందలపర్రు ఎంపీటీసీగా, భీమవరం మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్‌గా సేవలందించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తగిన గుర్తింపునిస్తారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌తో పాటు తనను ప్రోత్సహించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

27, 29న చెస్ ర్యాంకింగ్ పోటీలు

సాక్షి, భీమవరం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ నెల 27, 29 తేదీల్లో జిల్లా ర్యాంకింగ్ చదరంగం పోటీలు నిర్వహించనున్నట్టు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. పాలకొల్లులోని యూరో కిడ్స్ స్కూల్లో 27న చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. భీమవరంలోని వెస్ట్‌బెర్రీ స్కూల్లో 29న రెండో ర్యాంకింగ్ చదరంగ పోటీలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 90632 24466 నెంబరులో సంప్రదించాలని కోరారు.

రోల్‌బాల్ పోటీలకు తణుకు క్రీడాకారులు

తణుకు అర్బన్: రోల్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వచ్చే నెల 27 నుంచి 29 వరకు చెన్నైలో నిర్వహించే ఆల్ ఇండియన్ రోల్‌బాల్ పోటీలకు అండర్ -11 విభాగంలో తణుకుకు చెందిన స్కేటింగ్ రేంజర్స్ అకాడమీ క్రీడాకారులు కొండ్రు హేమ సత్యవరప్రసాద్, బొచ్చు కుష్యంత్ శ్రీసూర్యదత్తా ఎంపికైనట్టు కోచ్ వి.లావణ్య తెలిపారు. జిల్లాస్థాయిలో గత నెల 16, 17 తేదీల్లో తణుకు, జూలై 29, 30 తేదీల్లో గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మీట్‌లో, ఈ నెల 15న కేరళలో సౌత్ ఇండియా రోల్ బాల్ అసోసియేషన్ పోటీల్లో సత్తాచాటారని వివరించారు.

అన్నింటా ఆమె



సృష్టికి మూలం స్త్రీమూర్తులు.. అటువంటి మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు.. అంతటా ఆమె.. అన్నింటా ఆమెదే పైచేయి.. కుటుంబ నిర్వహణ నుంచి రాజకీయ నాయకులుగా, అధికారులుగా, పారిశ్రామికవేత్తలుగా, ప్రజాప్రతినిధులుగా కీలకంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని పథకాలను వారి పేరుపైనే అమలు చేస్తూ మహిళాభ్యున్నతికి కృషి చేస్తున్నారు. నేడు మహిళా సమానత్వ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. – సాక్షి ప్రతినిధి, ఏలూరు

స్వావలంబన.. సాధికారత
- అన్ని రంగాల్లోనూ పైచేయి
- కీలక పదవులు, కొలువుల్లో అగ్రస్థానం
- ఉపాధి బాటలో ముందంజ
- మహిళాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం
- పథకాలన్నీ వారి పేరుపైనే..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. పాడి, వంటల కుటీర పరిశ్రమలతో ప్రారంభమైన వీరి ప్రస్థానం ఇంతింతై బలీయమైన శక్తిగా మారింది. ప్రధానంగా స్థానిక సంస్థల్లో 50 శాతానికి పైగా పదవుల్లో వీరే ఉన్నారు. అధికార వ్యవస్థల్లోనూ నిర్ణయాత్మకశక్తిగా మారారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగుతున్నారు. పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్ పాలన వ్యవస్థలను సమర్థవంతంగా నిర్వహిస్తూ భళా అనిపిస్తున్నారు. అధికార వ్యవస్థ, రాజకీయాల్లో సమాంతంగా రాణిస్తూ కీలకంగా మారారు.

అధికారంలో పైచేయి
ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం నుంచి తానేటి వనిత నాలుగేళ్లుగా కేబినెట్ మంత్రి హోదాలో ఉన్నారు. భీమవరం కేంద్రంగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి సమర్థంగా పనిచేస్తున్నారు.

స్థానిక సంస్థల్లో..
ఉమ్మడి జిల్లాలోని 48 జెడ్పీటీసీ స్థానాలకు 25 చోట్ల, 858 ఎంపీటీసీ స్థానాలకు 430 చోట్ల మహిళలు ఉన్నారు. మున్సిపాలిటీ, పంచాయతీ పాలకవర్గాల్లోనూ వీరిదే పైచేయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా గంటా పద్మశ్రీ, ఏలూరు నగర మేయర్‌గా షేక్ నూర్జహాన్, జంగారెడ్డిగూడెం, నరసాపురం, ఆకివీడు, కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్లుగా బత్తిన లక్ష్మి, బర్రి వెంకటరమణ, జామి హైమావతి, భావన రత్నకుమారి పాలనాపగ్గాలు నిర్వహిస్తున్నారు.

నామినేటెడ్ పదవుల్లో..
ఉమ్మడి జిల్లాకు రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో 11 నామినేటెడ్ పదవులు దక్కగా వాటిలో ఐదు పదవులు మహిళలకే కేటాయించారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా బూసి వినీత, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్‌గా పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఇడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి బలరాం, ఏపీ స్టేట్ మినిమమ్ వేజెస్ అడ్వర్జరీ బోర్డు చైర్మన్‌గా బర్రి లీల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా చీర్ల పద్మశ్రీ, ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి కొనసాగుతున్నారు.

● అందరికీ గృహయోగం
వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో ఏలూరు జిల్లాలో 1,02,171 మంది మహిళలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. 759 లేఅవుట్లల్లో 87,122 ఇళ్ల స్థలాలు మహిళల పేరుతో పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్లు చేయించింది. అలాగే 15,049 ఇళ్లను కూడా వారి పేరుతోనే రిజిస్ట్రేషన్ చేసింది. ఇంటి స్థలాల అభివృద్ధి కోసం రూ.553 కోట్లు ఖర్చు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 70,938 ఇళ్లను మంజూరు చేసి రూ.397.50 కోట్లు ఖర్చు చేశారు.

● అమ్మఒడి.. సవ్వడి
అమ్మఒడి పథకం కింద పశ్చిమగోదావరి జిల్లాలో 4.32 లక్షల మహిళలకు రూ.648.03 కోట్లు, ఏలూరు జిల్లాలో 1,80,327 మందికి రూ.813.01 కోట్లు ఇప్పటివరకూ అందజేశారు.

● జగనన్న దీవెనలు
నాలుగేళ్లలో జగనన్న విద్యా దీవెన పథకం కింద ఏలూరు జిల్లాలో 36,527 మంది తల్లులకు రూ.335.58 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 43,790 మందికి రూ.295.75 కోట్లు అందజేశారు.

● ఉపాధికి 'చేయూత'
వైఎస్సార్ చేయూత ద్వారా ఏలూరు జిల్లాలో 94,670 మంది మహిళలకు రూ.561.53 కోట్లు అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 2.079 లక్షల మందికి రూ.389.69 కోట్లు అందించారు.

● ఆసరాతో భరోసా
వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఏలూరు జిల్లాలో 3,55,315 మంది మహిళలకు రూ.985.82 కోట్లు అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 2.40 లక్షల మందికి రూ.533.90 కోట్లు అందించారు.

పది నెలల్లో రూ.10 లక్షల లాభం





జంగారెడ్డిగూడెం మండలంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ఆధ్వర్యంలో మహిళలంతా కలిసి చేయూత మహిళా మార్ట్ ఏర్పాటుచేశాం. సుమారు 1,700 గ్రూపులు ఉండగా రూ.40 లక్షల నిధిని సేకరించాం. 10 నెలలుగా మా మార్ట్ దిగ్విజయంగా సాగుతోంది. నాణ్యమైన సరుకులను మార్కెట్ ధరల కంటే తక్కువకు విక్రయిస్తున్నాం. సుమారు రూ.1.62 కోట్ల విలువైన టర్నోవర్ చేశాం. రూ.10 లక్షల వరకు లాభాన్ని ఆర్జించాం. త్వరలో అన్ని గ్రూపులను లాభాలను పంచనున్నాం. ఇదే స్ఫూర్తితో మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నాం.
– బందారు రమణ, చేయూత మహిళా మార్టు అధ్యక్షురాలు, జంగారెడ్డిగూడెం

ప్రజలకు సేవ చేయడం ఆనందం



మా కుటుంబసభ్యులతో పాటు జెడ్పీ చైర్మన్ పీఠంపై కూర్చొని ప్రథమ పౌరురాలిగా ప్రజలకు సేవ చేయడం ఆనందంగా ఉంది. సీఎం జగన్ కల్పించిన అవకాశంతో ఈ అదృష్టం కలిగింది. పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో మహిళలు ముందుకు సాగుతున్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహిస్తారు.
– గంటా పద్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్

సమానత్వంతోనే సాధికారత



సమాజంలో మహిళలకు సమానత్వం ఉంటేనే సాధికారత సాధ్యం. నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారు. విద్యా, ఉపాధి రంగాల్లో రాణించడం, ఆరోగ్యం విషయాల్లో అన్నింటా మెరుగ్గా ఉన్నప్పుడే సమాజాభివృద్ధిలో ఆమె పాత్ర కీలకం. మహిళలకు సమానత్వ హక్కు ఉందని గుర్తించి వారిని అందరూ చిన్నతనం నుంచి ప్రోత్సహించాలి.
– పి.ప్రశాంతి, కలెక్టర్, పశ్చిమగోదావరి

విద్యతోనే సమానత్వం



సమాజంలో గౌరవం, సమానత్వం విద్యతోనే సాధ్యమవుతాయి. మహిళా సాధికారిత దిశగా అడుగులు వేస్తోన్న తరుణంలో అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ఆధునిక యుగంలో శక్తిసామర్థ్యాలు, సత్తా చాటుతూ ఉన్నత స్థానాలకు చేరేందుకు పట్టుదలతో కృషి చేయాలి. తల్లిదండ్రులు ఉన్నత లక్ష్యాలతో చిన్నతనం నుంచి పిల్లలను ప్రోత్సహించాలి.
– డి.మేరీ ప్రశాంతి, ఏలూరు జిల్లా ఎస్పీ

అరుదైన గౌరవం



మత్స్యకార వర్గానికి చెందిన తనకు మున్సిపల్ చైర్‌పర్సన్ వంటి అవకాశాన్ని సీఎం జగన్ ఇచ్చారు. మా వర్గంలో మహిళలకు రాజకీయంగా పెద్దపీట వేసిన పార్టీలు ఇప్పటివరకు లేవు. అందరూ మమ్మల్ని ఓటు బ్యాంకు గానే చూశారు. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఓ మత్స్యకార మహిళకు చైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వడం చాలా గొప్పవిషయం.
– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్, నరసాపురం

లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి, మంచి ఫలితాలు సాధించాలని కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు, భూ సేకరణ, ఓటర్ల జాబితా సవరణ, సివిల్ సప్లై తదితర అంశాలపై జాయింటు కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డితో కలసి జిల్లాలోని అన్ని మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా ప్రగతిని కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో తొలగించిన ప్రతి ఓటుపై పున:పరిశీలన చేయాలని కలెక్టరు స్పష్టం చేశారు. బీఎల్‌ఓలు తనిఖీ చేసిన ఫైల్స్‌ను పోలింగ్ స్టేషన్ల వారీగా ప్రత్యేక అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియ ఆగస్టు 30 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా నుంచి ఎంట్రీల తొలగింపునకు కారణాలపై ప్రజల్లో అవగాహన ఉండాలన్నారు. గ్రామాలలో రీ సర్వే వేగవంతంగా జరగాలని తెలిపారు. స్పందనలో వచ్చిన ప్రతి ఫిర్యాదుకు శాశ్వత పరిష్కారం చూపాలని, అదే ఫిర్యాదు స్పందనలో వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి చిన్న విషయానికి జిల్లా స్పందన కార్యక్రమానికి వస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని మండల స్థాయిలో స్పందన కార్యక్రమంలో ప్రతి అర్జీని బాధ్యతతో పరిష్కరించాలని స్పష్టం చేశారు. కోర్టు కేసులు నడుస్తున్న లేఅవుట్స్ త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కింది స్థాయి సిబ్బంది, టెక్నికల్ ఇబ్బందులు సాకులు చెప్పి ప్రభుత్వ లక్ష్యాలను కాలయాపన చేస్తే అలాంటి అధికారులను గుర్తించి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టరు హెచ్చరించారు. సమావేశంలో రెవిన్యూ అధికారి కె.కృష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తి పంతులు జయంతి వారోత్సవాలు
గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని ప్రతి సంవత్సరం తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని.. దీనిని పురస్కరించుకొని ఆగస్టు 23 నుంచి ఆగస్టు 29 వరకు జిల్లాలో గిడుగు రామ్మూర్తి జయంతి వారోత్సవాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లా కార్యాలయాల్లో తెలుగు భాషపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న అధికారులు, సిబ్బందిని ఎంపిక చేసి వారిని సముచిత రీతిలో సత్కరించాలన్నారు. అన్ని ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యాసంస్థల విద్యార్థులకు తెలుగు భాషకు సంబంధించి పోటీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. క్విజ్, కవితలు, సామెతలు, కథలు, కథానికలు, వ్యాసరచన, తదితర పోటీలు నిర్వహించాలన్నారు. తెలుగు భాషా రచనలో ప్రావీణ్యం సాధించిన ప్రముఖ కవులు, పండితులు, సాహితీవేత్తలను కనీసం 10 మంది తక్కువ కాకుండా సన్మానించాలన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి జి.రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): వచ్చే నెల 9న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి కోరారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా బీమా కంపెనీల అధికారులు, ఏపీఎస్ఆర్టీసీ, కార్మిక శాఖ, విద్యుత్ శాఖ అధికారులతో, పిటిషనరు న్యాయవాదులు, బీమా కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్‌తో కేసుల పరిష్కారం నిమిత్తం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది జూలై 22న నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 130 వాహన ప్రమాద పరిహార కేసులు రాజీ చేశామన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కూడా వాహన ప్రమాదాల కేసుల పరిష్కారం నిమిత్తం కృషి చేయాలన్నారు. ప్రతి రోజు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఉచిత లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నామని కక్షిదారులు నేరుగా గాని న్యాయవాది ద్వారా కానీ ఈ లోక్ అదాలత్‌లో పాల్గొని కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ



చిట్టిబాబును పరామర్శిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు మండలం తుక్కులూరులో శుక్రవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో యువగళం రౌడీమూక దాడిలో గాయపడి స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త యలమర్తి చిట్టిబాబును మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీ దుర్గ, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలడుగు నాని, అచ్చికాసులు తదితరులు పరామర్శించారు.

యువగళంకు జనం కరువు
మండలంతో పాటు పట్టణంలో శుక్రవారం టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తోన్న యువగళం పాదయాత్రకు జనం నుంచి స్పందన కరువైంది. మండలంలోని గొల్లపల్లి-మీర్జాపురం గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన శిబిరం నుంచి లోకేష్ ఉదయం 10 గంటలకు పాదయాత్ర ప్రారంభించి మధ్యాహ్నం 12 గంటలకు శివారులోని సర్వసతి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరం వద్ద పాదయాత్ర ఆపారు. ఈ పాదయాత్ర గొల్లపల్లి, మొర్సపూడి, తుక్కులూరుల మీదుగా కొనసాగినప్పటికీ జనం కరువయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అరకొరగా రావడం తప్పితే పాదయాత్రగా వస్తున్న లోకేష్‌ను చూసేందుకు గ్రామాల్లో రోడ్డు వెంట జనం పెద్దగా కనిపించలేదు. పట్టణ ప్రజలు పాదయాత్రను చూసేందుకు పెద్దగా ఆసక్తి కనబరచలేదు. ప్రధాన రహదారులన్నీ ఖాళీగానే దర్శనమిచ్చాయి. లోకేష్ వెంట వెయ్యి మందికి మించి ఉండరనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

చంద్రయాన్‌-3 దేశానికి గర్వకారణం



తాడేపల్లిగూడెం అర్బన్: చంద్రయాన్‌-3 ప్రయోగం విజయవంతం ద్వారా భారతదేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించాయని ఉప ముఖ్యమంత్రి కొట్టు కొనియాడారు. ఇస్రో శాస్త్రవేత్తలను మంత్రి కొట్టు కొనియాడారు. చంద్రమండలంలో దక్షిణ ధ్రువాన్ని మన శాస్త్రవేత్తలు ప్రపంచానికి చూపించడం గర్వకారణమన్నారు. అమెరికా తదితర దేశాలు ఆశ్చర్యపోయేలా భారత కీర్తి పతాకాన్ని చంద్రమండలంలో ఎగురవేయడం గర్వకారణమన్నారు. చంద్రయాన్ 3 ప్రయోగానికి ముందు వెంకటేశ్వరస్వామి దర్శనానికి ఇస్రో శాస్త్రవేత్తల బృందం తనను సంప్రదించగా వారికి దర్శనం ఏర్పాట్లు చేయించామన్నారు. చంద్రయాన్ తయారీకి ఉపయోగించిన ఒక పరికరాన్ని తీసుకువచ్చి శ్రీవారి వద్ద ఉంచి పూజ చేసి తీసుకువెళ్లారన్నారు. జాతీయస్థాయి ఉత్తమ నటుడు పురస్కారానికి ఎంపికైన అల్లు అర్జున్‌కు అభినందనలు తెలిపారు. మొదటిసారిగా తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి ఉత్తమ నటుడిగా పురస్కారం అందుకున్న అల్లు అర్జున్ గర్వకారణమన్నారు.

రాష్ట్రానికి ద్రోహం చేసిన వ్యక్తి లోకేష్

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి



దెందులూరు: రాష్ట్రానికి ద్రోహం చేసిన వ్యక్తి నారా లోకేష్ అని, ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను పిల్ల సైకోలని అవహేళనగా మాట్లాడడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్ధరాత్రి పాదయాత్ర చేసిన వారిని ఎక్కడా చూడలేదన్నారు. లోకేష్ అర్ధరాత్రి పాదయాత్రలకు ప్రజల నుంచి స్పందన రాకపోవడంతో ఫ్రస్టేషన్‌లో ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదన్నారు. ఎన్నికల్లో గెలవని లోకేష్ ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రిని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. లోకేష్‌కు ఎలాంటి అర్హత లేదని, చదువుకున్న వ్యక్తి, రాష్ట్రానికి మంత్రిగా పనిచేసిన వ్యక్తి హుందాగా వ్యవహరించాలని.. రాష్ట్రానికి ఏం చేస్తామో చెప్పాలే తప్ప.. పాదయాత్రలో చిత్రవిచిత్రంగా మాట్లాడటం లోకేష్‌కే చెల్లిందన్నారు. కులమత, వర్గ, ప్రాంతం చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నూరు శాతం అందిస్తున్నామని, రాష్ట్ర ప్రజలందరూ మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నూరుశాతం ఆదరిస్తారని అబ్బయ్యచౌదరి విశ్వాసం వ్యక్తం చేశారు. ఎక్కడా గెలవని లోకేష్, ఎక్కడ పోటీ చేస్తాడో తెలియక, ఏవేవో మాట్లాడుతున్నాడని, ఆ మాటలకు స్పందించాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే అన్నారు.

29న నాగర్‌సోల్ రైలు సమయం మార్పు

మొగల్తూరు: ఈ నెల 29న 11.15 గంటలకు బయలుదేరాల్సిన నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరుతుందని స్టేషన్ మేనేజర్ తెలిపారు. 28న ధర్మవరం నుంచి నరసాపూర్ రావాల్సిన ఎక్స్‌ప్రెస్ విజయవాడ వరకే నడుస్తుందని, 29న నరసాపురం నుంచి ధర్మవరం వెళ్లాల్సిన రైలు నరసాపురం నుంచి కాకుండా విజయవాడ నుంచి బయలుదేరుతుందని తెలిపారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తుల రాక



నరసాపురంలో మాట్లాడుతున్న న్యాయవాదులు

మొగల్తూరు: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగే సన్మాన కార్యక్రమానికి హైకోర్టుకు చెందిన న్యాయమూర్తులు రానున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్య నాయుడు తెలిపారు. శుక్రవారం నరసాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసాపురంలో న్యాయమూర్తిగా సేవలందించి ప్రస్తుతం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న జస్టిస్ టి.మల్లిఖార్జునరావు, ఉభయ తెలుగు రాష్ట్రాల హైకోర్టు న్యాయవాదులు యామర్తి చంద్రశేఖర్, కె.చిదంబరం, కృష్ణ సీవీ గ్రంధి తదితరులకు స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో సన్మానం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ రావు రఘునందనరావు, జస్టిస్ రవి చీమలపాటి, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి సి.పురుషోత్తమ కుమార్ హాజరుకానున్నారన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్జీ కుమార్, లైబ్రరీ కార్యదర్శి నారిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు



ఏలూరులో ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు అందిస్తున్న ఏడీ జీసీహెచ్ ప్రభాకర్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అర్హులైన ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపుకార్డులు జారీ చేస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జీసీహెచ్ ప్రభాకర్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని ఏడీ కార్యాలయంలో శుక్రవారం ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులను అందజేశారు. జిల్లాలో ఇప్పటివరకు 126 మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపుకార్డులు అందజేశామని, ఇంకా అర్హులుంటే తమ వివరాలతో కార్యాలయ పనివేళల్లో దరఖాస్తు అందజేయాలని కోరారు.

చపాతి కర్రతో భార్యపై దాడి

ఉండి: మద్యం మత్తులో భార్యపై దాడి చేసిన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఉణుదుర్రు శివారు సాగుపాడుకు చెందిన వజ్రపు మాలయ్య రోజూ మద్యం తాగి వచ్చి భార్య దేవమణిని శారీకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఈక్రమంలో ఈ నెల 22న రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవకు దిగి చపాతీ కర్రతో ఆమె ముఖంపై కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరగా, ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఎస్సై కే గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



1600 మీటర్ల పరుగులో పాల్గొన్న అభ్యర్థులు



ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలకు హాజరైన అభ్యర్థులు

ఎస్సై ఫిట్‌నెస్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 450 మంది అభ్యర్థులు హాజరు
- ఛాతీ, ఎత్తు, పరుగు పరీక్షలు నిర్వహించిన అధికారులు
- పర్యవేక్షించిన ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి



ఓ అభ్యర్థి ఛాతీని కొలుస్తున్న సీఐ విశ్వం

ఏలూరు టౌన్: ఎస్సై పోస్టుల భర్తీకి సర్కారు చర్యలు చేపట్టింది. ప్రిలిమినరీ పరీక్ష అనంతరం అభ్యర్థులకు ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం దేహదారుఢ్య పరీక్షలను నిర్వహించారు. తొలిరోజు 450 మంది అభ్యర్థులు హాజరు కాగా, వారికి స్క్రీనింగ్ టెస్ట్‌లతోపాటు, ఎత్తు, ఛాతి, బరువు కొలతలు తీసుకున్నారు. అనంతరం 100 మీటర్లు, 1600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు జరిపారు. పక్షం రోజుల పాటు కొనసాగే ఈ పరీక్షలకు మొత్తం 9,689 మంది అభ్యర్థులు పాల్గొననున్నారు. ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, డీఎస్పీలు సున్న మురళీకృష్ణ, కే.ప్రభాకరరావు, విజయపాల్ ఎంపిక ప్రక్రియను పరిశీలిస్తున్నారు.



ఫిజికల్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు



అభ్యర్థి చిప్‌ను స్కాన్ చేస్తూ..



డీఐజీ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో..



100 మీటర్ల పరుగులో పాల్గొన్న అభ్యర్థులు

విస్సాకోడేరు సర్పంచ్‌కు కలెక్టర్ అభినందన



విస్సాకోడేరు సర్పంచ్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్): రాజీవ్‌గాంధీ జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డును అందుకున్నందుకు పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామ సర్పంచ్ బోల్ల శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అభినందించారు. సర్పంచ్ బొల్లా శ్రీనివాసరావు అవార్డును అందుకున్న సందర్భంగా మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని శుక్రవారం కలెక్టరేట్‌లో కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోల్ల శ్రీనివాస్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. గత సంవత్సర కాలంలో విస్సాకోడేరు గ్రామ పంచాయతీని శానిటేషన్ రంగంలో అందరికీ ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దినందుకు రాజీవ్ గాంధీ నేషనల్ అవార్డు కోసం జిల్లా యంత్రాంగం నుంచి ప్రతిపాదనలు పంపించారు. ప్రతిపాదనలు పరిశీలన అనంతరం గ్రామాన్ని రాజీవ్‌గాంధీ నేషనల్ బెస్ట్ గ్రామ పంచాయతీ అవార్డుకు ఎంపికైంది. అవార్డును జూలై 19, 2023న బెంగళూరులోని గాంధీభవన్‌లో అకాడమీ ఆఫ్ గ్రాస్ రూట్స్ స్టడీస్ రీసెర్చ్ ఆఫ్ ఇండియా వారి చేతుల మీదుగా సర్పంచ్ బి.శ్రీనివాస్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, డీపీఆర్‌సీ ఎన్.ఎడ్వర్డ్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

చంద్రబాబు, లోకేష్‌పై పోలీసులకు ఫిర్యాదు



అత్తిలి ఎస్సైకు ఫిర్యాదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు

అత్తిలి: రాష్ట్రంలో విధ్వంసకర రాజకీయాలకు తెరలేపుతున్న చంద్రబాబు, లోకేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం అత్తిలి పోలీస్‌స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సోషల్ మీడియా కో-కన్వీనర్ బుడితి సుజన్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసు కేసులు ఎక్కువ ఉన్నవారికి నామినేటెడ్ పదవులిస్తామని లోకేష్ నిసిగ్గుగా ప్రకటించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నేరుగా ఎదుర్కోలేని చంద్రబాబు, లోకేష్‌లు భౌతికదాడులకు ఉసుగొల్పుతున్నారని, ఇటువంటి రాజకీయాలు రానున్న కాలంలో అత్యంత ప్రమాదకరమన్నారు. మండల ఎస్సీసెల్ అధ్యక్షులు కోరుకొల్లు వెంకట్రావు, సేవాదళ్ అధ్యక్షులు కంకటాల సతీష్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు పొన్నమల్లి సంపదరావు, ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీనివాస్, ఇల్లూరి సంపదరావు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలి

కొయ్యలగూడెం: టీడీపీ నేత నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్ నేతృత్వంలో స్టేషన్ హౌస్ అధికారికి ఫిర్యాదు చేశారు. లోకేష్ నిర్వహిస్తున్న యాత్రలో హింసాపూరిత ప్రసంగాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎవరిపై ఎన్ని ఎక్కువ పోలీసు కేసులు నమోదైతే వారికి తమ ప్రభుత్వం ఏర్పడ్డాక అంతటి ప్రాధాన్యత ఇస్తామని లోకేష్ ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో ఘర్షణలను ప్రేరేపించే విధంగా ప్రసంగిస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మండల అధ్యక్షులు గోడ్డటినాగేశ్వరావు, ఎంపీపీ గంజిమాల రామారావు, సచివాలయాల మండల కో-ఆర్డినేటర్ నూకల రాము, టౌన్ కన్వీనర్ సంకుకొండ, ఎంపీటీసీ సభ్యులు గంటా శ్రీను పాల్గొన్నారు.

బలుసులమ్మకు వెండి వాకిలి తయారీకి శ్రీకారం

తాడేపల్లిగూడెం: పట్టణ ఇలవేల్పు బలుసులమ్మతల్లికి వెండివాకిలి తయారు చేయిస్తున్నట్టు బలుసులమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు శుక్రవారం చెప్పారు. మొత్తం 40 కిలోల వెండితో వెండి వాకిలి తయారీకి శ్రీకారం చుట్టామన్నారు. తొలుత 25 కిలోల వెండితో పనులను ప్రారంభిస్తున్నామని, విజయదశమికి సిద్ధమవుతుందని, దసరా ఉత్సవాల్లో ఇది సమర్పిస్తామన్నారు. వెండి వాకిలి తయారీకి డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పది కిలోల వెండిని, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఈతకోట తాతాజీ కిలో వెండి, డాక్టర్ చిట్యాల సురేంద్రకుమార్ అరకిలో వెండి కానుకగా సమర్పించారన్నారు. మంత్రి కొట్టు ప్రోత్సాహంతో రూ.కోట్లు వెచ్చించి అన్నదాన భవనం, కోనేరు, యాగశాల, కార్యాలయ భవనం, అర్చకులకు వసతి గృహాలు నిర్మించనున్నామన్నారు. కర్రి భాస్కరరావు, కల్లి శ్రీనివాసు, పెదప్రోలు భాస్కరాచార్యులు, ఈఓ ఏ.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాండ్రం.. ప్రశాంతం



వాండ్రంలో ఇరుపక్షాలతో చర్చిస్తున్న పోలీసులు, గ్రామ పెద్దలు

ఉండి: గత కొద్దిరోజులుగా వాండ్రంలో నెలకొన్న గొడవలు శుక్రవారం గ్రామ పెద్దలు, పోలీసులు చొరవ తీసుకుని ఇరుపక్షాలతో చర్చించి వారిని ఏకం చేశారు. దీంతో గ్రామంలో గొడవలు సద్దుమణిగి ప్రశాంతత నెలకొంది. దీనిపై గ్రామ పెద్దలు ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, మాజీ సర్పంచ్‌లు రెడ్డిపల్లి సత్యనారాయణ, కందుల రాధా బలరాకృష్ణ, కోనాల రాజేంద్రకుమార్ మాట్లాడుతూ గ్రామంలో కొందరు ఆకతాయిల వల్ల జరిగిన చిన్న తగాదా చిలికిచిలికి గాలివానగా మారిందన్నారు. గ్రామ ప్రజలు సమన్వయంతో వ్యవహరించడం వల్ల ఇప్పటివరకు గొడవలు జరగకుండా చూశారన్నారు. ఐకమత్యానికి మారుపేరైన గ్రామం ఇటీవల అనుకోని సంఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా పోలీసులు తీసుకున్న చర్యలు ద్వారానే గ్రామంలో గొడవలు చోటుచేసుకోలేదన్నారు. వారికి మేమంతా రుణపడి ఉంటామన్నారు. ఆకివీడు సీఐ కేవీవీఎస్ సత్యనారాయణ, ఉండి ఎస్సై కే గంగాధరరావు మాట్లాడుతూ వాండ్రంలో గొడవలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు జిల్లా ఎస్పీ రవిప్రకాష్ ఆదేశాల మేరకు భీమవరం డీఎస్పీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో వాండ్రంలో ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలించి పికెటింగ్ నిర్వహించడం, ఎక్కడైనా అనుమానంగా ఉంటే వారితో మాట్లాడి సమన్వయ పరచడంతో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగలేదన్నారు. ఆర్డీవో దాసిరాజు, డీఎస్పీ శ్రీనాథ్ సహకారంతో ముందుగానే శాంతి కమిటీ రూపొంచామన్నారు. శుక్రవారం గ్రామ పెద్దలు, ఇరుపక్షాల పెద్దలు సమావేశమై సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వాండ్రం సమస్య పరిష్కారంతో జిల్లా ఎస్పీ రవిప్రకాష్ పోలీసులు అభినందించారు. ఇరుపక్షాల పెద్దలు కొనాల రాజేంద్రకుమార్, గేదెల నర్సింహమూర్తి, వెలమల రాము, సందక శ్రీనివాస్, మంద శ్రీనివాసరావు, కోనాల సంజీవరావు, విప్పర్తి మహేష్, గోరింకల ఏసేబు, బొంగురోతు నారాయణ, వేలం రామకృష్ణ, పర్వతాల నారాయణ, పచ్చా నర్సింహం, కొరకూటి చంద్రయ్య, పినిపే సువర్ణరాజు, కోనా సుదర్శనం, దీసిళ్ల వెంకటరత్నం, మందా ఏసుపాదం పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం 17వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకు అర్బన్: తణుకు 24వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

గోదావరిలో దూకి యువతి ఆత్మహత్య



మృతురాలు మరియ

నరసాపురం రూరల్: నరసాపురంలో బాపూ విగ్రహం వద్ద శుక్రవారం మతిస్థిమితం లేని ఓ యువతి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రాయపేటకు చెందిన సుద్దపల్లి వెంకటలక్ష్మి కుమార్తె మరియకు మానసిక స్థితి సరిగా లేదు. తరచూ ఫిట్స్ వస్తుంటాయి. మతి స్థిమితం లేక తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోతుండేది. శుక్రవారం తల్లి పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సమయానికి కుమార్తె కనిపించకపోవడంతో చుట్టుపక్కల ఆరా తీసింది. అయితే బాపు విగ్రహం వద్ద ఓ యువతి గోదావరిలో దూకిందని తెలయడంతో తల్లి వెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొండాలమ్మ గుడి ప్రాంతంలో గోదావరిలో మరియ (25) మృతదేహాన్ని గుర్తించగా, పట్టణ ఎస్సై బీఎస్‌డీఆర్ ప్రసాద్ సిబ్బందితో కలసి పడవలో వెళ్లి ఆమె మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

కాల్వలో దూకి వివాహిత గల్లంతు

తణుకు: కుటుంబ తగాదాల కారణంగా ఓ వివాహిత కాలువలోకి దూకి గల్లంతైంది. వివరాల్లోకి వెళితే.. తణుకు హౌసింగ్ బోర్డు కాలనీకు చెందిన సంఘం అరుణకుమారి (20)కి నరసాపురానికి చెందిన దుర్గాప్రసాద్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఎనిమిది నెలల బాబు ఉన్నాడు. కుటుంబ కలహాల వల్ల ఇటీవల అరుణకుమారి పుట్టింటికి వచ్చి ఓ ఫ్యాన్సీ దుకాణంలో పనిచేస్తోంది. శుక్రవారం షాపునకు వెళుతున్నానని చెప్పిన అరుణకుమారి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి వద్ద వంతెనపై నుంచి కాల్వలోకి దూకింది. ఈ ఘటన చూసిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. అరుణకుమారి ఆచూకీ కోసం గాలించినప్పటికీ ఫలితం లేదు. దీంతో తండ్రి చినశ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ఏటీఎం పిన్ యాక్టివేట్ చేస్తానని టోకరా

వృద్ధురాలి బ్యాంక్ ఖాతా నుంచి రూ.47 వేల అపహరణ

సాక్షి, భీమవరం: ఏటీఎం పిన్ యాక్టివేట్ చేస్తానని చెప్పి ఓ వృద్ధురాలిని నమ్మించి ఆమె బ్యాంక్ ఖాతా నుంచి రూ.47 వేలను అపహరించాడో ఆగంతకుడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమవరం మండలం దెయ్యాలతిప్ప గ్రామానికి చెందిన పోతురాజు ఎలిజబెత్ ఏటీఎం కార్డుకు దరఖాస్తు చేయగా వచ్చింది. కార్డు పిన్ నిమిత్తం గొల్లవానితిప్పలోని బ్యాంకుకు ఈ నెల 22వ తేదీన వెళ్లింది. అక్కడినుంచి భీమవరం బ్రాంచికి పంపించారు. రెండు రోజుల తర్వాత వినియోగంలోకి వస్తుందని బ్యాంకు అధికారులు చెప్పారు. బ్యాంకు బయట ఉన్న ఓ వ్యక్తి బాధితురాలి దగ్గరకు వచ్చి వివరాలు అడిగాడు. తనని బ్యాంకు కాపలాదారుగా పరిచయం చేసుకున్నాడు. బ్యాంకులో వెంటనే పనిచేయరంటూ నమ్మించాడు. ఏటీఎంలో కార్డు ఉపయోగించినా ఫలితం ఉండదని, యాప్ డౌన్లోడ్ చేస్తే ఓటీపీ వస్తుందన్నాడు. ఆమె నుంచి ఓటీపీ వివరాలు తీసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత కార్డు పనిచేయడంలేదంటూ తిరిగి ఇచ్చేసి పక్కకు వెళ్లాడు. ఏటీఎంలో నగదు తీయలేదు కదా అని ఆమె ఇంటికి వెళ్లిపోయింది. శుక్రవారం భీమవరంలోని బ్యాంకుకు మళ్లీ వచ్చి ఖాతాలో ఖాతాలో నగదు పరిశీలించుకోగా, తక్కువగా ఉండటంతో ఏటీఎం పిన్ ద్వారా పరిశీలిస్తే నగదును ఏలూరులోని ఆర్.లక్ష్మి పేరున ఉన్న ఖాతాకు బదిలీ చేసినట్టు ఉంది. దీంతో బాధితురాలు భీమవరం ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించగా సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించారు. వివరాలను సేకరిస్తున్నారు. వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని మెకానిక్ మృతి



పడాల రాజు మృతదేహం

తణుకు: బైక్‌పై వెళుతూ అదుపుతప్పడంతో డివైడర్‌ను ఢీకొని ఓ మెకానిక్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పైడిపర్రు ప్రాంతానికి చెందిన పడాల రాజు (30) స్థానికంగా ఓ మెకానిక్ షెడ్డులో పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పని ముగించుకుని మోటారుసైకిల్‌పై ఇంటికి వెళుతుండగా జాతీయ రహదారిపై స్థానిక గౌతమి సాల్వెంట్స్ వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజు అపస్మారక స్థితికి చేరడంతో స్థానికులు 108 అత్యవసర వాహనం సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చేలోపుగానే రాజు మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ కోసం దరఖాస్తు చేయండి

ఏలూరు (మెట్రో): రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్‌ను 2023-24 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో కొత్తగా అక్రిడిటేషన్ కార్డు పొందిన వర్కింగ్ జర్నలిస్టులు హెల్త్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాధికారి ఆర్‌వీఎస్ రామచంద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జర్నలిస్ట్ ఆరోగ్య బీమా పథకం జర్నలిస్ట్‌కు, వారి భార్య/భర్త, పిల్లలు, జర్నలిస్టుపై ఆధారపడిన తల్లిదండ్రులకు వర్తిస్తుందన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం ప్రీమియం రూ.2,500 కాగా ఇందులో ప్రభుత్వం వాటా రూ.1,250 రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని, జర్నలిస్టు వాటాగా రూ.1,250 చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు, సంబంధిత ధ్రువపత్రాల నకళ్లతో సెప్టెంబర్ 5వ తేదీలోగా డీపీఆర్ఓ కార్యాలయం, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రక్కన, నరసింహారావు పేట, ఏలూరు-534006 చిరునామాకు పంపాలని సూచించారు.

వ్యాన్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఆకివీడు: వ్యాన్‌ను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో ఓ ప్రయాణికుడికి తీవ్ర గాయమైంది. స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలో హైవేపై గుడివాడ నుంచి భీమవరం వైపు ఆర్టీసీ బస్సు శుక్రవారం వెళుతుండగా, బస్సు ముందు ఉన్న అకస్మాత్తుగారేక్ వేయడంతో బస్సు డ్రైవర్ అప్రమత్తంగా లేకపోవడంతో వ్యాన్‌ను బస్సు ఢీకొంది. బస్సులో గాయాలపాలైన ప్రయాణికుడు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని వెళ్లిపోయారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మకు విశేష అభిషేకాలు


శ్రీముత్యాలమ్మ వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని ముత్యాలమ్మ వారికి శుక్రవారం ఆవు పాలు, చెరకు రసం, సుగంధ, సౌభాగ్య ద్రవ్యాలతో అమ్మవారిని అభిషేకించారు. శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి హరేరామ్‌ప్రసాద్ సౌకర్యాలు కల్పించారు. అలాగే, మండలంలోని వీరంపాలెం, వెంకట్రామన్నగూడెం, కృష్ణాయపాలెం, మాధవరం, అప్పారావుపేట, జగన్నాథపురం, నవాబుపాలెం, నందమూరు, మోదుగ గుంట, దండగర్ర, నీలాద్రిపురం తదితర గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాలు శుక్రవారం మహిళలతో కళకళలాడాయి.

బోసన్ మోటార్స్‌తో 'ఎస్ఆర్‌కేఆర్' ఒప్పందం


ఒప్పందం చేసుకుంటున్న కళాశాల కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంత్ వర్మ

సాక్షి, భీమవరం: ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ప్రపంచ ఖ్యాతి గాంచిన బోసన్ మోటార్స్ సంస్థతో ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, బోసన్ మోటార్స్ సంస్థ డైరెక్టర్ సూరి భూపతిరాజు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ నిశాంత్ వర్మ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు ఇంటర్న్‌షిప్, వర్క్‌షాప్‌లోనూ వివిధ విభాగాల్లో శిక్షణ వంటి అంశాలు ఒప్పందంలో ఉన్నాయన్నారు. అమెరికాలో ప్రముఖ స్టార్టప్ కంపెనీగా పేరు పొందిన ఈ సంస్థకు భారత్‌లోని చెన్నై, తిరుపతిలో కూడా ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం హెడ్ డాక్టర్ బీఆర్‌కే వర్మ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, ట్రిపుల్ ఈఈఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.కాంతారావు, శ్రీనివాస్, డాక్టర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలవపూడిలో వైద్య శిబిరం


కలవపూడిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: శివారు గ్రామ ప్రజలకు బైర్రాజు ఫౌండేషన్ ద్వారా వైద్య సేవలు అందించడం అభినందనీయమని పలువురు నాయకులు కొనియాడారు. బైర్రాజు ఫౌండేషన్, హెచ్‌పీ వావ్ బస్సు వారోత్సవాల్లో భాగంగా కలవపూడిలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా సుమారు 250 మంది రోగులకు సుగరు, బీపీ పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, పరిరక్షణ, పర్యావరణం, ఆధునిక విద్య, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌పై దృశ్య రూపంలో వివరించారు. అదేవిధంగా గ్రామంలోని మహిళలకు డిజిటల్, ఫైనాన్షియల్ లిటరసీ మీద కాలేజీ విద్యార్థులతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వికాస సమితి కన్వీనర్ మంతెన శ్రీనివాసరాజు, పంచాయతీ కార్యదర్శి ఎం.అనూష, బైర్రాజు ఫౌండేషన్ కో-ఆర్డినేటర్స్ పెనుమాక భానుమూర్తి, తంగెళ్ల పద్మారావు, ఆరోగ్య కో-ఆర్డినేటర్ ఎంఆర్‌కే రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధార్ శిబిరాలు


కోరుకొల్లులో ఆధార్ శిబిరంలో ప్రజలకు సేవలందిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని పాలకోడేరు, కోరుకొల్లు, పెన్నాడ, శృంగవృక్షం గ్రామాల్లో శుక్రవారం ఆధార్ శిబిరాలు నిర్వహించారు. ఆధార్ కార్డులు అప్‌డేట్, కార్డులు లేనివారికి ఆధార్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నూకల మురళి గంగాధర్‌రావు మాట్లాడుతూ ఆధార్ శిబిరాల ద్వారా మండలంలో 306 మందికి సేవలు అందించామన్నారు. 2016 సంవత్సరానికి ముందు ఆధార్ కార్డులు తీసుకున్నవారు మళ్లీ ఆధార్ తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు.

నవరత్నాలతో సంక్షేమ వెలుగులు

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- 17వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం


17వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజలతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : నవరత్నాల పథకాలతో పేదల ఇంట సంక్షేమ వెలుగులు విరబూస్తున్నాయని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. స్థానిక 17వ వార్డులో గడప గడప కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా మేలు పొందలేదని ఇప్పటి వరకు ఎవరూ చెప్పలేదన్నారు. వలంటీర్ , సచివాలయ వ్యవస్థల ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నామన్నారు. భారతదేశంలో ఏరాష్ట్రంలోను లేనివిధంగా సంక్షేమ పథకాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పాలనపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అవగాహన కోసం పంపించారన్నారు. సంక్షేమ పాలనలో ప్రజలు సంతోషంగా జీవిస్తుంటే అప్పుల పాలు చేస్తున్నారని ప్రతిపక్షాలు విషప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. పవన్‌కల్యాణ్‌కు చంద్రబాబు అవినీతి, ఆక్రమణ పాలన కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు. 2014లో కౌంటర్ గ్యారెంటీ ఇచ్చి తెదేపాను గెలిపించిన పవన్‌కళ్యాణ్ ఆ తర్వాత హామీ అమలు చేయలేదని చంద్రబాబును ప్రశ్నించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంటికి కిలో బంగారం ఇస్తానన్నా చంద్రబాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ఒకేసారి 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. జగన్ పరిపాలన విధానం ప్రపంచంలోనే చరిత్ర సృష్టించారని చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుల, మత, రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని, దివ్యాంగులకు సైతం పెద్దపెట్ట వేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, మున్సిపల్ ఇంజినీరు మురళీకృష్ణ, కొట్టు విశాల్, గుండుబోగుల నాగు, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, బొద్దు సాయిబాబా, గొర్రెల రాజశేఖర్, బోళెం రామలక్ష్మి, ముప్పిడి సంపత్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- తణుకు 24వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం


తణుకులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు సంక్షేమ బ్రోచర్ అందజేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: గ్రామ స్థాయిలో ఇంటి వద్దకే పరిపాలన తీసుకువచ్చిన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 24వ వార్డు కుమ్మర్ల వీధిలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి గడపలోనూ మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని ప్రజలు చెబుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీని మెప్పించగలిగిన వారికి మాత్రమే పథకాలు అందేవని, కానీ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమాన్ని సృష్టించి అర్హులందరికీ అందిస్తున్న వైనంపట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సంక్షేమంతో పేదవర్గాలను ఆర్థికంగా ఆదుకుంటున్న ప్రభుత్వానికి మేము రుణపడి ఉంటామని ముక్తకంఠంతో చెబుతున్నారని తెలిపారు. పేదవర్గాల పిల్లలు బడిబాట పట్టే విధంగా అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు సద్వినియోగపడుతున్నాయని అన్నారు. నాడు- నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చి విద్యార్థులకు లోతుగా విషయ పరిజ్ఞానాన్ని అందిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా స్థానికులు తెలిపిన సమస్యలను మంత్రి కారుమూరి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఈ రామకిషోర్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, కర్రి కాశీరెడ్డి, వార్డు నాయకులు ఆకుల కిరణ్, చేకిట్టి లలితా శంకర్, ఎస్పీ రెడ్డి, బండి సతీష్, గంటా ప్రసాద్, వి.పార్వతి, ఇ.సత్యనారాయణ, సీహెచ్ సత్యనారాయణ, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

దోమల నివారణ సామాజిక బాధ్యత


తాడేపల్లిగూడెం పట్టణంలో ఫ్రైడే డ్రైడే ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


పెంటపాడు మండలం దర్శిపర్రులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమల నివారణ అందరి సామాజిక బాధ్యత అని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని యాగర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి, గృహ యజమానులకు సూచనలు చేశారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయని, ఇంటి ఆవరణలో పొడి వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు ఝాన్సీ లక్ష్మీబాయి, వెంకటలక్ష్మి, ఆరోగ్య సహాయకులు ఎస్.ప్రసాద్ బాబు, కాంతారావు, రామకృష్ణ, ఆరోగ్య పర్యవేక్షకులు మోహన్‌రావు, మెర్సీ, శానిటేషన్ కార్యదర్శి శ్రీదేవి, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పెంటపాడు: దోమల నివారణతో వ్యాధులు దరిచేరవని ముదునూరు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ ఎస్వీ రమణ, గూడెం మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై. వీ లక్ష్మణరావు పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. పరిసరాల్లో మురుగునీరు లేకుండా చూసుకోవాలన్నారు. దోమతెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో నియోజకవర్గంలో చేపట్టిన గృహ నిర్మాణాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు సొంతిల్లు ఉండాలనే ఆనాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి భూసేకరణ చేసి గృహ నిర్మాణాలు చేశారని గుర్తు చేశారు. నేడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్రంలో సుమారుగా 30 లక్షల మందికి పైగా ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు కూడా ఇచ్చారన్నారు. అంతేకాక గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల నిధులు ఇవ్వడంతో పాటు బ్యాంకుల నుంచి మరో రూ.30 వేల వరకు రుణాలు కూడా అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జగనన్న కాలనీల పేరుతో కొత్తగా ఊళ్లకు ఊళ్లు ఏర్పడుతున్నాయని ఆయన అన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేయాలని, అప్పుడే సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యం నెరవేరినట్లు అవుతుందన్నారు. భీమవరం నియోజకవర్గంలో దాదాపుగా 15 వేల మందికి పైగానే పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసి పట్టాలు ఇచ్చారని, వీరిలో ఎక్కువ మంది గృహ నిర్మాణాలు చేసుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ ఈఈ వేణుగోపాల్, మున్సిపల్ ఎంఈ త్రినాధరావు, ఎంపీడీవో వెంకటలక్ష్మి, ఏఈలు శశి కుమార్, మూర్తి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అలంపురంలో మెగా వైద్యశిబిరం

పెంటపాడు: మండలంలోని అలంపురం గ్రామంలో వెంకటరమణసేవా చారిటీ ఆసుపత్రిలో ఈనెల 26న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో విజయవాడకు చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ తీగల రమేష్, హైదరాబాద్ అపోలో ఆసుపత్రికి చెందిన గాంగ్రీన్ (సుగరుక్రానిక్) వైద్యనిపుణులు రాజశేఖర్‌లతో పాటు, రాజమండ్రి జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రికి చెందిన ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు, గుండె వైద్యనిపుణులు వచ్చి గుండెకు సంబంధించి పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. పరీక్షల కోసం వచ్చిన రోగులకు ఉచిత భోజన సదుపాయాలు కల్పించినట్లు కృష్ణంరాజు వెల్లడించారు. ఈ శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం


పెద అమిరంలో దివ్యాంగులకు మోటార్ వెహికల్స్ పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

కాళ్ల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. కాళ్ల మండలం పెద అమిరం గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం దివ్యాంగులకు మోటార్ వెహికల్స్ పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 10 మంది దివ్యాంగులకు రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా ఈ వెహికల్స్ అందజేశారు. కాళ్ల మండలానికి రెండు, ఆకివీడుకు రెండు, ఉండికి మూడు, పాలకోడేరుకు మూడు చొప్పున మోటార్ వెహికల్స్ మంజూరయ్యాయి. ఈ సందర్భంగా నర్సింహరాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుల, మత, రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని, దివ్యాంగులకు సైతం పెద్దపెట్ట వేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాళ్ల, ఉండి జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో కలెక్టర్ విస్తృత పర్యటన


మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మున్సిపాలిటీలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు, ఓటర్ల జాబితా సర్వేను శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత జేపీ రోడ్డు అయ్యప్ప స్వామి గుడి 34వ వార్డు ప్రాంతంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న డ్రెయిన్ పరిశీలించారు. డ్రెయిన్ నిర్మాణం కారణంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. అనంతరం 20వ వార్డులోని ఎడ్వర్డ్ ట్యాంక్ వద్ద డ్రెయిన్ పరిశీలించి పనులను త్వరితగతిన చేపట్టాలని, ట్యాంక్ చుట్టుపక్కలా మొక్కలు నాటడం, వాకింగ్ పాత్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తర్వాత బీసీ కాలనీలో అమృత్ 2.0 నిధులు రూ.2.14 కోట్ల వ్యయంతో నిర్మించిన 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను సందర్శించారు. పైపులైన్ పనులను త్వరగా పూర్తిచేసి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటర్ ట్యాంక్ మార్గంలో రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలను రూపొందించాలన్నారు. ఒకటో వార్డు సీపీఎం కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులు, వంతెన ప్రాంతాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ త్రినాధరావు, ఇన్‌చార్జ్ డీఈ, పబ్లిక్ హెల్త్ ఈఈ విజయ్ ఉన్నారు.

అవసరానికి మించి ఎరువులు వాడొద్దు


తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెం గ్రామంలో పొలంబడి కార్యక్రమం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పంట అవసరాలకు మించి ఎరువులు వాడొద్దని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో రైతులకు మంచి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ అధిక మోతాదులో ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు పంటలకు దోమ ఉధృతి పెరుగుతుందన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ రైతు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్ పథకం సొమ్ములు పడని రైతులు వెంటనే ఆర్‌బీకేలను సంప్రదించాలన్నారు. ఇదిలా ఉంటే, 40 శాతం రాయితీపై రైతు గ్రూపులకు డ్రోన్లను అందిస్తామన్నారు. ఆసక్తి గల రైతులు తనను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ఆంజనేయులు, రైతులు ఉమా, రామకృష్ణ, గంగాధర్, శివయ్య, శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం


సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తణుకు టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ,ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు చెప్పారు. శుక్రవారం తణుకు హౌసింగ్ బోర్డులో జరిగిన మాల మహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి ప్రాంతంలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా చంద్రబాబు, లోకేష్, ప్యాకేజీ స్టార్ పవన్ కళ్యాణ్‌లు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్లు నిర్మించి తీరుతారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల పేదలకు మేలు చేసేలా సంక్షేమ, అభివృద్ధి పథకాలను వలంటీర్ల ద్వారా అందిస్తున్నారని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా మూడు రాజధానులతో పాటు పేదల హక్కులు సాధించి తీరుతామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే కొడాలని నాని, గన్నవరం ఎమ్మెల్యే వంశీలను చంపేస్తామని లోకేష్ బహిరంగం ప్రకటించడం దారుణమని చెప్పారు. ఇటువంటి వ్యాఖ్యలపై పౌర సమాజం తక్షణం స్పందించాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, పీవీరావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జీవీ ప్రసాద్, జిల్లా ఎస్సీ,ఎస్టీ, విజిలెన్స్, అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పీ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు దాస్య విముక్తి కల్పించిన 'మండల్'


తాడేపల్లిగూడెం పట్టణంలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: బీసీలకు దాస్య విముక్తి కల్పించిన మహోన్నత వ్యక్తి బీపీ మండల్ అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశి అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని బీసీ ప్రజాసంక్షేమ సంఘ కార్యాలయంలో బీపీ మండల్ 105వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కాశి మాట్లాడుతూ దేశ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు ఆత్మగౌరవాన్ని కల్పించారన్నారు. బీసీలు కేవలం ఓటర్లు కాదని, ఈ దేశ పాలకులని దేశానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి మండల్ అని పేర్కొన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో బీపీ మండల్ సిఫార్స్ చేసిన 40 సిఫార్సులలో కేవలం ఒకే సిఫార్స్ అమలు చేస్తున్నారంటే ఈ దేశ పాలకులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోలేని స్థితిలో బీసీలు లేరన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు కేశవభట్ల విజయ్, ప్రధాన కార్యదర్శి తుమరాడ సత్యనారాయణ (చిన్న), జిల్లా ఉపాధ్యక్షుడు మారిశెట్టి నరసింహమూర్తి, నియోజకవర్గ కార్యదర్శి లక్ష్మణ్, సీనియర్‌బీసీ నాయకులు పెదిరెడ్ల సతీష్, లీగల్‌సెల్ కన్వీనర్ మూర్తి, వాకా నాని, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో శ్రావణ శోభ


అత్తిలిలో కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


ప్రత్తిపాడు వై.జంక్షన్‌లో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

అత్తిలి: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో మహిళలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అత్తిలిలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం, సాయంత్రం వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ప్రసాదాలను స్వీకరించారు.

శ్రావణలక్ష్మి అలంకరణలో కనకదుర్గమ్మ

పెంటపాడు: శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పర్వదినం సందర్భంగా పట్టణంలోని అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవార్లకు విశేష అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణలు, మణిద్వీప వర్ణన పారాయణలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు విశేష అలంకరణలు చేశారు. ప్రత్తిపాడు వై.జంక్షన్ వద్ద కనకదుర్గమ్మ శ్రావణ లక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి పంచ హారతులు ఇచ్చి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అర్చకులు కొత్తలంక శివసత్యనారాయణ, ఆలయ చైర్మన్ సైపరెడ్డి రాంబాబుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే ప్రారంభం

పాలకోడేరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న నవరత్నాల పథకాల్లో లబ్ధిదారులు సిటిజన్ ఔట్ రీచ్ సర్వే శుక్రవారం పాలకోడేరులో నుంచి ప్రారంభమైంది. వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి, ఇంటింటికీ తిరిగి పథకాలు అందరికి అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. కాపు నేస్తం ఐదో విడత, వైఎస్సార్ చేయూత నాలుగో విడత నిధులు త్వరలో విడుదల అవుతాయని, ఇంకా లబ్ధిదారులు ఎవరైనా ఏదైనా కారణాల వల్ల మిగిలిపోయారా అని విచారణ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నూకల మురళి గంగాధర్‌రావు మాట్లాడుతూ సిటిజన్ ఔట్ రీచ్ సర్వే రెండు రోజులపాటు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరాజు, మహాలక్ష్మి, పూర్ణిమ అధికారులు సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.